# గంగ పెళ్ళిముహూర్తం

రావినూతల సువర్ణకన్నన్



"ఇదిగో!కాఫీ అయిందా?" వీధిలోంచే పెద్దగా అరిచాడు దాసు. భర్త ప్రవర్తనతో విసిగిపోయిన పార్వతి-

"అవలేదు. అవదు. ఎందుకంటే ఇంట్లో కాఫీ పొడి లేదు, పంచదార లేదు. పాత బాకీ ఇవ్వందే గిద్దెడు పాలు పొయ్యనన్నాడు పాలవాడు" అంది నిర్లక్ష్యంగా.

అవునుమరి! ఆ ఇల్లాలు మాత్రం ఏం చేస్తుంది?ఎమ్మే పాసైనా, మామగారు మంచి వుద్యోగం ఇప్పిస్తానన్నా, ఘనాపాటి అవధానిగారబ్బాయి అన్న మంచి పేరున్నా, ఒళ్లొంచి పని చెయ్యడం ఇష్టం లేక, వూర్న పడి కనిపించిన వారితో కబుర్లతో కాలక్షేపం చేస్తూ, తిండి వేళకి కొంపకి చేరి భార్యని వేధించే ఏ ఇల్లాలైనా అంతకన్నా ఏం చేస్తుంది? అందునా దారిద్ర్యంలో మగ్గి పోతున్న పార్వతిలాంటి భార్య!

భార్య మాటలకి చిర్రెత్తుకొచ్చింది దాసుకి. "అయిందా దండకం?...నోరెత్తితే చాలు వెధవ దండకాలు మొదలు పెడతావు. మొగుడు గుక్కెడు కాఫీ అడిగితే శాపనార్థాలు పెట్టే నువ్వేం భార్యవే?" అంటూ విసురుగా బైటికెళ్లి పోయాడు దాసు.

అప్పుడే ఓ స్వాము లారు వూళ్లొకొచ్చారనీ, ఆయన దగ్గరికి జనం

తండోపతండాలుగా వెళ్తున్నారనీ, డబ్బు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతోందనీ విన్న దాసుకి ఓ బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది. స్వాములారిలా కాకపోయినా.. ఆ రూట్‌లోనే వెళ్తే కడుపులో చల్ల కదలకుండా హాయిగా బతికెయ్యొచ్చని ఓ పథకం వేశాడు. పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, పక్క గ్రామంలోని ఓ పాడు పడ్డ పెంకుటింటిని ఓ ఆశ్రమంగా మార్చేశాడు. జాతకాలు చెప్తాననీ, ముహూర్తాలు పెడతాననీ, చక్రాలు వేస్తాననీ ఇంకా ఇలాంటివే చాలా రాయించి ఓ బోర్డు కట్టాడు. తనలాంటి సోమరిపోతుల్నే ఇద్దర్ని శిష్యులుగా ఎంచుకున్నాడు. వాళ్ల పని అతని గురించి గొప్పగా ప్రచారం చెయ్యడం. "ఏది ఎలా వున్నా అవధానిగారబ్బాయి అన్నది ఒక్కటి చాలు అతను బతకడానికి"అనుకున్నాడు.

అతని అంచనా తప్పలేదు. అవధానిగారి మీద వున్న అభిమానంతో కొందరు అతని దగ్గిరకొచ్చి సలహాలు తీసుకునే వారు. తృణమో ఫణమో ముట్ట చెప్పేవారు. దీనికి తోడు శిష్యులు చిలువలు,పలువలు చేసి ప్రచారం చెయ్యడంతో అతన్ని గురించి చాలా మందికి తెలిసింది. రద్దీ పెరిగింది. వేలు,లక్షలూ రాకపోయినా ఇల్లు హాయిగా గడిచి పోతోంది. శ్రమ పడకుండానే జీవితం సాఫీగా గడిచి పోవడంతో తనని తానే అభినందించుకున్నాడు దాసు.

ఆ రోజు పొద్దున్నే స్నానపానాదులు పూర్తి చేసుకొని, జీర్ణావస్థలో వున్న తండ్రి పట్టుబట్టలు కట్టుకుని, ముఖానికి, చేతులకి ఇంత విబూది పట్టించి ఎప్పటిలా శిష్యులతో కలిసి ఆశ్రమానికి (పెంకుటింటికి) బయల్దేరాడు. అయితే అతని దురదృష్టం ఆ రోజు మధ్యాహ్నం దాకా ఎవరూ రాలేదు. మూడు గంటల తర్వాత నలుగురైదుగురు వచ్చి పిచ్చాపాటీలో పడ్డారు. దాసులో దిగులు మొదలైంది. మరో పది నిముషాలకి తెలుగు సినిమాలో విలన్లా వున్న ఓ ధృఢకాయుడు తన అనుచరుడితో సహా వచ్చాడు. ఏదో సినిమాలో సంఘటన గుర్తొచ్చి- "వీడు నా దగ్గర మామూలు వసూలు చెయ్యడానికి రాలేదు కదా!"అనుకుని హడలిపోయాడు దాసు. అయితే దాసు వూహించినట్టు అతను ఎలాంటి దౌర్జన్యం చెయ్య లేదు. సరికదా తన అనుచరుడి చేతిలో వున్న పళ్లుపూలు వున్న బుట్ట తీసి దాసు ముందు పెట్టి వినయంగా నమస్కరించాడు. అతనికి దాదాపు నలభై ఏళ్లుండొచ్చు. అప్పటికి కుదుట పడ్డ దాసు-

"ఆయుష్మాన్భవ! ఏం కావాలి నాయనా?" అన్నాడు మహా భారత్ సీరియల్‌లోని భీష్ముడి పోజులో.

"నా పేరు నరసిమ్మ సామీ! తవరో మంచి మూర్తం పెట్టాల!" అన్నాడా ధృఢకాయుడు వినయంగా.

"తప్పకుండా నాయనా! ఏ ముహూర్తం? బారసాల ముహూర్తమా? అన్నప్రాశన ముహూర్తమా? లేక శీమంతం ముహూర్తమా?"అన్నాడు దాసు అచ్చం స్వామీజీ లెవల్లో.

అయ్యేంగాదు సామీ పెల్లి మూర్తం ఎట్టాలి. మా మరదలు గంగకి. అదే. మాయావిడ సెల్లికి! అవును సామీ! దాని అమ్మా, బాబూ పోతే అయిదేల్ల పిల్ల దగ్గర్నించీ మామే సాకినం. అంతేనా కాలేజీలో సేర్పించి సదూకూడా సెప్పించినాం. ఇంక పెల్లి సెయ్యాల. పెల్లి మాత్రం తిరపతి కొండమీద జరగాల. ఇవరంగా పెల్లి పత్రిక తవరే రాయాల!వినయంగా అన్నాడు నరసింహ.

దాసు మొహం వికశించింది. పంచాంగం వగైరాలు తిరగేసి "అమ్మాయి పేరేమిటన్నావ్?"అన్నాడు వేళ్ల మీద ఏవో లెక్కలేస్తూ.

"గంగానమ్మండి!గంగ అంటావండి!"

"అబ్బాయి పేరు?"

"యాద్గిరండి!"

"బావుంది!" అంటూ మరి కొన్ని వివరాలు తెలుసుకుని

"రేపు దశమి బుధవారం దివ్యమైన ముహూర్తం. ఆ ముహూర్తానికి ఈ పెళ్లి జరిగిందో ఇంక వాళ్లిద్దరూ చిలకా గోరింకల్లా వుంటూ గంపెడు సంతానాన్ని కని నూరేళ్లూ హాయిగా వుంటారు" అంటూ లగ్న పత్రిక రాసి నరసింహ చేతిలో పెట్టాడు. నరసింహం మొహం వెలిగిపోయింది. జేబులోంచి ఓ నూట పదహారు రూపాయలు తీసి దాసు చేతుల్లో పెడుతూ-

"పెళ్లయి వచ్చాక తమ దర్శనం చేసుకుంటాం సామీ" అంటూ వెళ్లి పోయాడు. దాసు ముఖం మరింత వెలిగిపోయింది. అతని ఆనందం చూసిన



## అందమైన మగాడితో ఒక రాత్రి

*బాలీవుడ్ భామల మనోగతాలు చాలా చిత్రంగా వుంటాయి. మీరూ, ఒక అందమయిన విలన్ ఒంటరిగా వున్నారనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు? మీరేం చేసినా మిమ్మల్నేం చేసినా పిలిస్తే పలికే దిక్కు లేదు. ఒక రాత్రంతా గడప వలసి వచ్చింది ఎలా గడుపుతారు? బాలీవుడ్ భామలు మాధురీ దీక్షిత్, ప్రీతి జింతాల చిలిపి భావాలు సరదాగా వినండి!*

**మాధురీదీక్షిత్:** *ఇదేం ప్రశ్న? ముఖ్యంగా నేనలాంటి విషమ పరిస్థితుల్ని కొని తెచ్చుకోను. రెండోది అందమైన విలన్ అయినా అంద విహీనమైన విలన్ అయినా నా ధోరణి ఒకటే. బి గుడ్, డు గుడ్. దట్సాల్!*

**ప్రీతి జింతా:** *మీ ప్రశ్న బావుంది. భలే ఎగ్జయిటింగ్‌గా ఫీలవుతాను. ఒక అందమైన లొకేషన్‌లో ఒక అందమైన మగాడితో లొకేటెడ్‌గా గడపడంలో చాలా థ్రిల్ వుంది. ఇంక విలన్ అంటే భయపడతాననుకుంటున్నారా? విలన్లు మగవాళ్లల్లోనే కాదు. ఆడవాళ్లల్లోనూ వుంటారు. గనుక నాకా భయం లేదు. మాటకు మాట, పాటకి పాట, దెబ్బకి దెబ్బ... ఫినిష్!! (నవ్వు)*

ఒకతను-

"ఇదిగో పొంతులూ! అంతలా పొంగిపోమాక! నీకీ వూరు కొత్త. ఆడి పేరు కత్తుల నరసిమ్మ! పచ్చి నెత్తురు తాగేరకం. ఏ మాత్రం తేడా వచ్చినా నరికి పోగులెడతాడు!"అన్నాడు.

"ఆ! ఏడిశాడు! వాడు బైటెంత పులైనా ఇంట్లో మాత్రం పిల్లే. వాడి పెల్లాంతో గట్టిగా మాట్లాడ్డానికే హడలి చస్తాడు. అసలా రంగి మూలంగా కాదు ఆ గంగని కాలేజీకి పంపింది, ఇప్పుడు గంగ పెళ్లికి లగ్నం పెట్టించుకు రమ్మని మొగుణ్ణంపి వుంటుంది. మన పంతులు లగ్గమెట్టాడు ఇంక తేడా ఏమొస్తుంది ఈయన్నాడేం చేస్తాడు!" తేలిగ్గా అన్నాడు మరొకతను.

"ఇతను పెల్లానికి భయపడతాడా?" విస్మయంగా అన్నాడు దాసు.

"ఆడేంటి వూరంతా ఒణికి చస్తుంది. అన్నట్టు నీకావిడ గురించి తెలియదు కదూ. ఆవిడ పేరు రంగమ్మ గయ్యాళి రంగి అంటారంతా. ఆమె నోట్లో నోరెట్టి గెలిచినాళ్ళు ఈ ఫరిగణాల్లోనే లేరు. మంచివాళ్ళ దగ్గర మంచిగానే వుంటుందనుకో!" అన్నాడింకోఅతను.

తగూలంటే హడిలిపోయే దాసుకి వాళ్ళ మాటలు కాస్త కంగారు పెట్టినా తను తప్పుపనేం చెయ్యలేదన్న నమ్మకం రవ్వంత ఊరటనిచ్చింది. నిజంగ్గానే అతను తండ్రి దగ్గర కొన్ని వేదాలు అవీ నేర్చుకున్నాడు.

నాలుగు రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. అయిదో రోజు మధ్యాన్నం హిడింబిలాంటి ఓ స్త్రీ వచ్చింది దాసు దగ్గరికి. ఆవిడ చేతిలో ఏవో కాయితాలున్నాయి. మొహం గంభీరంగా వుంది. ఆవిడ తనతో ఏదో పనుండి వచ్చిందని ఊహించిన దాసు-

"ఏవరుతల్లీ నువ్వు! ఏం కావాలి?" అన్నాడు ప్రసన్న వదనంతో,

"ఇక్కడ పెళ్ళి మూర్తాలెట్టేది తవరేనా?" అందామె క్లుప్తంగా,

"అవును తల్లీ! పెళ్ళి ముహూర్తాలేకాదు ఏ ముహూర్తాలైనా పెడతాను." అన్నాడు దాసు రవంత దర్పంగా.

"అయితే మా సెల్లి పెల్లికి మూర్తమెట్టింది కూడా తవరేగా!"

"మీ చెల్లా? ఎంతో మందికి ముహూర్తాలు పెడతాను. అందులో మీ చెల్లెలెవరో ఎలా గుర్తుంటుంది తల్లీ. ఇంతకీ నీ చెల్లెలు పేరు?" వేలాది మందికి దర్శనం ఇస్తున్న పోజులో అన్నాడు దాసు.

"పేరు కావాలా...నా సెల్లి పేరు గంగ. నా పేరు రంగమ్మ! నా మొగుడి పేరు నరసిమ్మ! ఆ ఇవరాలు సాలా?" వ్యంగ్యంగా అంది రంగమ్మ. దాసు పై ప్రాణాలు పైనే పోయినట్టయ్యాయి. అయినా ధైర్యం తెచ్చుకుని-

"ఓ! రంగమ్మంటే నువ్వేనా?... మీ చెల్లెలి పెళ్లి ముహూర్తం పెట్టింది నేనేనమ్మా! అది దివ్యమైన ముహూర్తం. అలాంటి ముహూర్తం మరిప్పట్లో లేదు. ఏం ! ఆ ముహూర్తం బాగా లేదని ఏవరైనా అన్నారా?" అన్నాడు కళ్లు చిట్లిస్తూ.

"ఆహా! అది మా మంచి మూర్తమే! కానీ నాను మరో మూర్తం పెట్టిద్దామొచ్చాను." తాపీగా అంది రంగమ్మ.

"అలాగా! చాలా సంతోషం. ఇంతకీ ఏం ముహూర్తం కావాలి? గర్భాదాన ముహూర్తమా?"

"కాదు! నీ సావు మూర్తం!"


బిగుసుకు పోయాడు దాసు. బిత్తర పోయారు శిష్యులు. " ఏమయింది రంగమ్మా?" తేరుకున్న దాసు తడారిపోతున్న గొంతుతో అన్నాడు.

"ఇంకా ఏవయిందని అడుగుతున్నావా? అవదాన్లు గార్లాంటి మగానుబావుడి కడుపున పుట్టి ఇలాంటి పాడు పన్లు సెయ్యడానికి సిగ్గు నేదూ? కట్టపడి బతకడం సేతగాకపోతే నాలుగిల్లు ముట్టెత్తుకు తిను. అంతేగానీ పచ్చని కాపురాల్లో సిచ్చెట్టమాక! ఇగో! చూడు. సచ్చెక్కడున్నాడో ఆ అవదాని బాబు కొడుకువని సూత్తన్నాను గానీ నేక పోతే నువ్ జేసిన పనికి తవ్వి పాతరేసేదాన్ని" కాళిలా అరిచింది రంగమ్మ.

ఈసారి నిలువెల్లా ఒణికిపోయాడు దాసు. "అసలేం జరిగింది రంగమ్మా? ఆవేశపడకుండా జరిగింది చెప్పు!"అక్కడికి చేరిన నలుగురూ అనునయంగా అడిగారు.

రంగమ్మ కాస్త శాంతించింది.

"ఇంకా ఏం జరగాలా! కాత్తెలో కొంప గుండమై పోయేది! మాయమ్మా,బాబూ పోయే నాటికి మా



గంగి తొమ్మిదేల్ల పిల్ల మీకు తెల్సుగా! మాకా పిల్లల్లేరు. దాన్నే కన్నబిడ్డలా సాకుతన్నాం. ఆడు ఇల్లు పట్టకుండా తిరుగుతున్నా కాయకట్టం సేసి, కడుపుకట్టుకుని ఇల్లు గడుపుకొత్తన్నాను. నాలా నా గంగి కట్టపడకూడదని, కూరా,నారా, ఏసుకుని, పాలూ పెరుగూ అమ్ముకుంటూ నానా అవస్థలూ పడి దాన్ని సదివించుకున్నాను. మెత్తగా వుంటే ఈ లోకం ఎలా సూత్తందో నాకు బాగా తెలుసు. అందుకే నోరెట్టుకు బతుకుతున్నాను. నా నోటికే నా మొగుడు అడిలిసత్తాడు. కానీ నా గంగ గంగిగోవులాంటిది. నోట్లో నాలుక లేని పిల్ల. అంతేనా పెద్దింటోల్ల పిల్లలాగుంటాది. దాన్ని సూసి ఆల్ల కాలేజీలోనే ఓ మంచి కుర్రోడు మనసిచ్చాడు. ఇదీ ఇట్ట పడింది, విసయం సెప్తే నేనూ సరే అన్నాను. ఇంక అంతే ఆడు అగ్గి మీద గుగ్గిలంలా మండి పడ్డాడు. గంగ తన సొత్తే అన్నాడు. దాన్ని తనే సేసుకుంతానన్నాడు. నేను సెప్పెట్టి కొట్టినంత పన్జేశాను. గంగ తిండి తిప్పలూ మాని ఏడుత్తా పడుకుంది. అయినా ఆడు పంతం మాన్లేదు. నేను గంగనే కత్తుకుంతానని శపదం సేసి ఇల్లిదిగో ఈయనకాడికొచ్చి లగ్గవెట్టించి పెల్లికి తయారవుతున్నాడు. ఆడికి బుద్ది నేదు సరే నెయ్యి అన్నం తినే ఈయనకి బుద్ది వుండద్దూ. కూతుర్లా పెరిగిన పిల్లతో మనువుకి మూర్తం పెడతాడా?" సివంగిలా అరిచింది రంగమ్మ.

అమ్మలక్కలంతా ముక్కున వేలేసుకున్నారు. దాసుకి అంతా అర్థం అయింది.

"నిజంగానే ఇవేం నాకు తెలియదు రంగమ్మా! మా మరదలికి పెళ్లి ముహూర్తం పెట్టమని వచ్చాడు. పెట్టాను. అయినా వరుడి పేరు యాద్గిరి అని చెప్పాడే?" అన్నాడు మెల్లగా.

దాసుమొహంలోని నిజాయితీని చూసిన రంగమ్మ-"ఆ! ఆడిపేరు యాద్గిరి నరసిమ్మ! నరసిమ్మ అని సెప్పడానికి సిగ్గుపడి యాద్గిరి అని సప్పుంటాడు" అంది శాంతంగానే.

"తెలిసి చేసినా, తెలియక చేసినా నేను చేసింది పొరపాటే రంగమ్మా! నన్ను క్షమించు. ఒళ్లు ఒంగక కుటుంబాన్ని పోషించుకోవడానికి ఏదో ఓ మార్గం చూసుకుందామనుకున్నానే తప్ప దాని వల్ల ఇన్ని అనర్థాలొస్తాయని వూహించలేదు. అసలు మీ ఆయనెవరో, అతని వృత్తేమిటో కూడా నాకు తెలియదు. తెలిసీ నేనెవరికీ ద్రోహం చెయ్యలేదు. చెయ్యను. నా గాయత్రి సాక్షిగా చెప్తున్నాను నన్ను నమ్ము!" అంటూ రెండు చేతులూ జోడించాడు దాసు. అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

నోటి దురుసుతనం తప్ప వ్యక్తిగా మంచిదైన రంగమ్మ దాసు తనకి నమస్కరించేసరికి గిలగిల్లాడి పోయింది.

## శ్రీ మూకాంబికాదేవి స్తోత్రం

త్రిశక్తి రూపిణీందేవీం।
త్రైలోక్య రక్షాకరీం।
త్రిజన్మ పాపహారిణీం। వన్దే
మాంపాహి మూకాంబికే॥

సర్వదేవ సు అర్చితేఅంబే।
సర్వాంతరాత్మాణి స్థితే।
చరణౌతవ ప్రణతోస్మి
మాం పాహి మూకాంబికే॥

స్వర్ణతేజం। మహాశక్తిం।
సర్వశోక వినాశినీం।
స్మరామి సతతంమాత్రే।
మాం పాహి మూకాంబికే॥

-పిశుపాటి ఉమామహేశ్వరమ్

"ఒద్దు బాబూ! అంత మాట వద్దు! మీరు దరమరాజులాంటి అవదానిగోరి బిడ్డ. మీరు మొక్కితే మాకు మంచిది కాదు. కాని మీకన్నా పెద్దదాన్ని ఒక్క మాట సెప్తాను ఇంటారా బాబూ?"అంది ఆప్యాయంగా చూస్తూ.

"చెప్పు రంగమ్మా!" మనస్ఫూర్తిగా అన్నాడు దాసు.

"మీరు సదూకున్నోరు. అన్నీ తెల్సినోరు. అయిగా తమకి తగ్గ నౌకరీ చేసుకోక ఈ వంకరదార్లెందుకు బాబూ! ఈ రోజుల్లో సామీజీలనీ, మాతృశ్రీలనీ పుట్టగొడుగుల్లా పుట్టుకొత్తన్నారు. మీలాటి సదూకున్నారే ఆల్లకి పట్టం కడతన్నారు. అందులో ఎంత మంది నిజమైన సాములున్నారో సెప్పగలరా బాబూ! మీ గురించి అంతా ఇన్నాను. అందుకే సెప్తున్నాను. అయిగా ఏదైనా మీకు తగ్గా నౌకరీ సూసుకోండి!...అన్నట్టు ఇదిగో మీరెట్టిన మూర్తం కాయితం. ఇందులో పిల్లగాడి పేరు, ఆల్ల బాబు పేరు మార్చి రాసివ్వండి. మీరెట్టిన ఈ మూర్తానికే మా గంగమ్మ పెల్లయిపోవాల!" అంది రంగమ్మ నవ్వుతూ.

"అమ్మో! ఈ విషయం నరసింహకి తెలిస్తే?" హడలిపోతూ అన్నాడు దాసు.

"ఆ! తెల్సింది. కత్తుచ్చుకు బయల్దేరాడు. కానీ నానూరుకుంటానేటి? కాలూ సేతులూ కట్టి గదిలో పడేసొచ్చినాను. అంతేకాదు. నీ జోలికొత్తే అదే కత్తితో ఆడ్ని సంపి నాను జైలుకెల్తానని శపదం సేసి మరీ వచ్చేసినాను.. ఈ జలమలో ఇంక నీ జోలికి రాడు..నువ్వు మాత్రం సక్కని నౌకరీలో చేరిపో" అంటూ కాయితం అందించింది రంగమ్మ.

దాసు మనసు దూది పింజలా అయిపోయింది. రంగమ్మ చెప్పినట్టు లగ్న పత్రిక రాశాడు.

ఇదిగో రంగమ్మా! గంగ పెళ్లి ముహూర్తం" అంటూ ఆమెకందించాడు. ఆమె డబ్బు ఇవ్వబోతుంటే-

" ఒద్దు రంగమ్మా! నువ్వు నాకు కొత్త జీవితమే ఇచ్చావు. ఇంక ఈ జాతకాలూ, ముహూర్తాలూ అంటూ తిరగను. దొరికితే వుద్యోగం చేస్తాను. లేకపోతే నీలాగే కాయకష్టం చేసి నా కుటుంబాన్ని పోషించుకుంటాను" అన్నాడు దాసు భారంగా.

రంగమ్మ మొహంలో మాతృప్రేమ తొణికిసలాడింది. మనసులో ఆశీర్వదిస్తూనే నిష్క్రమించింది.

అంతే! గంగ పెళ్లి ముహూర్తం తర్వాత ఇంక ఎలాంటి ముహూర్తాల జోలికీ పోలేదు దాసు. తన తెలివి తేటలతో,మంచి తనంతో తన ఇంటిని ఓ చక్కని స్వీట్ హోమ్‌గా మలుచుకుని పది మందికి జీవనోపాధిని కలిపించాడు. ❋

